క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


బి.లావణ్య

ఉప్పలగుప్తం: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని మునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బి.లావణ్య ఎంపికైందని హెచ్ఎం వై.ఏడుకొండలు సోమవారం తెలిపారు. లావణ్య కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–17 వాలీబాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఆమె పాల్గొంటుందని పీడీ నూకల సీతాపతి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఎస్ఎంసీ చైర్మన్ వై.కిరణ్, ఉపాధ్యాయులు ఎస్.ప్రసాద్ తదితరులు అభినందించారు.

తైలంపై విచారణ జరిపించాలి

అమలాపురం టౌన్: కొత్తపేట మండలం మందపల్లి శనీశ్వరస్వామి ఆలయంలో తైలాభిషేకానికి వినియోగించే తైలం అవకతవకలపై విచారణ జరిపించాలని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్వామికి తైలాభిషేకం చేసే నువ్వుల నూనెను కొందరు వ్యాపారులు వైట్ ఆయిల్‌గా మార్చి అక్రమంగా కోనసీమలోని పలు హోటల్స్‌కు అమ్ముతున్నారని ఆరోపించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ పూర్తి స్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రొఫెసర్ ముత్యాలుకు డాక్టరేట్

యానాం: యానాం సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న తాతపూడి ముత్యాలు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి సోమవారం డాక్టరేట్ అందుకున్నారు. అర్థశాస్త్ర విభాగపు సీనియర్ ప్రొఫెసర్ దోమ్మేటి పుల్లారావు పర్యవేక్షణలో ×ఎనాలిసిస్ ఆఫ్ ప్రైమరీ ఎడ్యుకేషన్ ఇన్ ఎరస్ట్‌వైల్ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్¶పై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ముత్యాలును ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, అధ్యాపకులు అభినందించార

బాధితులకు రక్షణ కల్పించాలి

అమలాపురం టౌన్: జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టిన సమయంలో జరిగిన అల్లర్లలో కొందరిపై పోలీసులు పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు వినతి పత్రం అందించారు. కులం పేరిట వేధిస్తేనే ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసు నమోదు అవుతుందని, బాధితులు ఎస్సీ, ఎస్టీలు అయినంత మాత్రాన ఆ చట్టం వర్తించదంటూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో ఉటంకించారు. జిల్లా అధికారులు ఈ అంశాన్ని పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

వరద బాధితులకు రూ.50 వేల ఆర్థిక సాయం

తాళ్లరేవు: రాష్ట్రంలో సంభవించిన వరదల వల్ల నష్టపోయిన బాధితుల సహాయార్థం కోరంగి బాలభారతి విద్యానికేతన్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రూ.50 వేల నగదును డీడీ రూపంలో స్కూల్ ప్రిన్సిపాల్ పితాని బాలవెంకటరమణ, ఎంఈఓ ఎ.మంగాయమ్మకు సోమవారం అందజేశారు. వరద బాధితులకు సహాయం అందించిన విద్యార్థులను కరస్పాండెంట్ రాయుడు శ్రావణ్‌కుమారి, హెచ్ఎం బొంతు ఈశ్వర్‌ప్రసాద్, ఉపాధ్యాయులు గండి నాని, బొడ్డు చంద్రశేఖర్, వైదాడి దేవి, విత్తనాల వరలక్ష్మి అభినందించారు.

వారి సేవలు అభినందనీయం

అమలాపురం టౌన్: అమలాపురం కమ్యూనికేషన్ ఎస్ఐ కె.దుర్గాప్రసాదరావు, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ పీఎస్‌వీఎస్‌వీహెచ్‌బీ రాజు విధి నిర్వహణలో అందించిన సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐలు దుర్గాప్రసాదరావు, రాజులకు స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన వీడ్కోలు సభకు ఎస్పీ కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, స్పెషల్ బ్రాంచ్ సీఐలు బి.రాజశేఖర్, వి.శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆక్వా సాగుకు అనుమతివ్వాలి

అమలాపురం రూరల్: రాజోలు నియోజకవర్గంలో ఆక్వా చెరువులు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంతర్వేది తదితర తీర ప్రాంతాలకు చెందిన ఆక్వా రైతులు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోతురాజు కిషోర్‌తో పాటు ఆక్వా రైతులు ఆకుల నరేష్, రాంబాబు, నాగు, ఎం.వెంకటేశ్వరరావు, పత్తి సత్యనారాయణ మాట్లాడుతూ తీర ప్రాంతంలో సముద్రం కిలో మీటరు ముందుకు రావడంతో కొబ్బరి తోటలు, వేరుశెనగ, సర్వే తోటలు వంటివి సాగు చేసేందుకు వీలు లేకుండా చౌడు భూములుగా మారిపోయాయన్నారు. అందుకే 30 ఏళ్లుగా రొయ్యల సాగు చేసుకుని బతుకుతున్నామని, వాటిని తొలగిస్తే తమ ఉపాధి దెబ్బ తింటుందన్నారు. చెరువులు లేకపోతే ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు విస్తరించారు.. స్తంభాలు వదిలేశారు

- కరెంట్ స్తంభాలు తొలగించకుండానే సీసీ రోడ్డు నిర్మాణం
- వాటి తొలగింపునకు రూ.56 లక్షలు చెల్లించినా పట్టించుకోని అధికారులు


దేవగుప్తంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు


కరెంట్ స్తంభాలు తొలగించకుండానే నిర్మించిన సీసీ రోడ్డు

అల్లవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పుణ్యమా అని అల్లవరం మండలంలోని ప్రధాన రహదారులు విస్తరణకు నోచుకున్నాయి. ప్రయాణికులకు ప్రయాణం సాఫీగా సాగేందుకు మార్గం సుగమమైంది. మాజీ ఎంపీ చింతా అనురాధ చొరవతో సీఎస్ఆర్ నిధులు రూ.25 కోట్లతో పేరూరు నుంచి ఓడలరేవు వరకూ రోడ్డు విస్తరణకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. తొలిదశలో పేరూరు నుంచి గోడిలంక వరకూ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. రెండో దశలో బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకూ సీసీ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండగా ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. అయితే రోడ్డు విస్తరిస్తున్నా పదుల సంఖ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను మాత్రం అలాగే వదిలేయడం విమర్శలకు తావిస్తోంది.

పదుల సంఖ్యలో కరెంట్ స్తంభాలు

సెంట్రల్ రిజర్వ్ ఫండ్ నిధులు రూ.20 కోట్లతో గుడ్డివానిచింత నుంచి ఎస్.పల్లిపాలెం వరకూ 10 కిలో మీటర్ల పొడవునా రోడ్డు విస్తరణ పనులు గత ప్రభుత్వంలో మాజీమంత్రి పినిపే విశ్వరూప్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులు మొదట్లో వేగంగా జరిగినా క్రమేణా పనులు మందగించాయి. గుడ్డివానిచింత నుంచి డి.రావులపాలెం వరకూ 7 మీటర్ల వెడల్పున విస్తరణ పనులు పూర్తి చేసి డి.రావులపాలెం సెంటర్ నుంచి దేవగుప్తం వరకూ సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఏడు మీటర్ల వెడల్పున నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు పదుల సంఖ్యలో కరెంట్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయి. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించిన తర్వాతే సీసీ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. అయితే ఇవేమీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకుండా సీసీ రోడ్డును నిర్మించేస్తున్నారు. వాస్తవానికి రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించడానికి రూ.56 లక్షలను కాంట్రాక్టుదారుడు విద్యుత్ శాఖకు చెల్లించారు. విద్యుత్ స్తంభాల ట్రాన్స్‌పోర్టు చార్జీలను కాంట్రాక్టుదారుడు చెల్లించి ఏడాది కావస్తున్నా విద్యుత్ శాఖ నేటికీ తొలగించలేదు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఏడాది కాలంగా రోడ్డు నిర్మాణం ఆలస్యం అవుతూ వచ్చింది. దీంతో ఇక వేచి చూడలేక కాంట్రాక్టుదారుడు సీసీ రోడ్డు పనులను చేసేస్తున్నారు. స్తంభాలు తొలగించకుండా సీసీ రోడ్డు వేయడంపై ప్రయాణికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు తొలగించే సమయంలో రోడ్డు మళ్లీ పాడైతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ఆర్అండ్‌బీ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్తంభాలు తొలగించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

రోడ్డు వేశాక తొలగిస్తాం

స్తంభాలు తొలగించడానికి సూపర్‌వైజింగ్ చార్జీలు చెల్లించడం వాస్తవమే. సీసీ రోడ్డు వేసిన చోట రోడ్డు పాడవకుండా దానికి సమాంతరంగా కట్ చేసేలా నిర్ణయం చేస్తున్నాం. మరో మూడు రోజుల్లో సీసీ రోడ్డు నిర్మాణం అవుతుంది. ఆ తర్వాత స్తంభాలు తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.
– రాఘవరావు, ఆర్అండ్‌బీ డీఈ, అమలాపురం

ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలంటూ ధర్నా


అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నాని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, నాన్ పర్మినెంట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని జేసీ నిశాంతికి అందించారు. ఆందోళనలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, అధ్యక్షుడు ఎ.దుర్గాప్రసాద్, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఓ.కృష్ణవేణి తదితరులు మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులు చేసే పనినే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో చేయిస్తున్నప్పుడు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు 2013లో ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో అన్ని శాఖల్లో అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఉద్యోగుల శ్రమను దోచుకోవడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యేలు మాత్రం నెల జీతం రూ.2 లక్షలు తీసుకుంటుంటే, కనీస వేతనం రూ.26 వేలు మాత్రమే అడుగుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, జిల్లా కార్యదర్శి గణపతి, ఉపాధ్యక్షుడు ఏడుకొండలు, మేరి, వరలక్ష్మి, పాలమూరి శ్రీను, శ్రీనివాస్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


పల్లంకుర్రులో సుందరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: పల్లంకుర్రులో మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సాపే సూర్య ప్రకాష్‌ను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇసుకపట్ల శివశంకరరావు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. సాపే సుందరమ్మ, శివశంకర ప్రసాద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ నాతి అలివేణి, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, నల్లా నరసింహమూర్తి, కాట్రేనికోన సర్పంచి గంటి వెంకట సుధాకర్, నాతి సత్యనారాయణ, కాశి హనుమంతరావు, జీటీ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పంచాయతీ భూమి కబ్జాపై ఫిర్యాదు


జేసీకి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ సింహాద్రమ్మ

తాళ్లరేవు: మండల పరిధిలోని గోవలంక పంచాయతీ పరిధిలో 16 సెంట్ల పంచాయితీ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)లో జేసీ రాహుల్ మీనాకు సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ ఫిర్యాదు చేశారు. ఆక్రమణకు గురైన స్థలంలో గతంలో మార్కెట్‌ను నిర్మించాలని పంచాయతీ తీర్మానం చేశారన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో ఆసుపత్రి నిర్మాణానికి పూనుకుంటే కబ్జా చేసిన వారు అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం ఆక్రమించిన భూమిని పంచాయతీకి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విజేతగా దరియాలతిప్ప జట్టు


జోనల్ గేమ్స్‌లో విజేత దరియాలతిప్ప హైస్కూల్ జట్టు

యానాం: జోనల్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన అండర్–17 బాలికల వాలీబాల్ పోటీల్లో దరియాలతిప్ప డాక్టర్ కేఆర్‌నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్ విజేతగా నిలిచింది. సోమవారం డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్స్‌లో దరియాలతిప్ప జట్టు ప్రథమ స్థానంలో, ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో, గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ వినకోటి సన్యాసిరావు తెలిపారు. వారంతా మాహేలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, పీఈటీలు పాము సత్యనారాయణ, పీఈఎస్ ప్రకాష్, కొప్పనాతి రమేష్, భాస్కర్, వడ్డి వరప్రసాద్ అభినందించారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

తాళ్లరేవు: వరద కారణంగా ముంపునకు గురైన పంట పొలాలకు సంబంధించి ఎకరానికి రూ.25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కౌలు రైతు సంఘం, సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల భవనం వద్ద సోమవారం సీపీఎం పార్టీ మహాసభ చల్లా సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సీపీఎం జెండాను పలివెల సింహాచలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట దెబ్బతిన్న పొలాలకు తక్షణమే నష్ట పరిహారం, పెట్టుబడి సాయం రూపేణా ప్రభుత్వం ఇస్తానన్న రూ.20 వేలు రైతులకు ఇవ్వాలన్నారు. రాబోయే మూడేళ్లకు శాఖ కార్యదర్శిగా రాజబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, కేఎస్ శ్రీనివాస్, మండల కార్యదర్శి టి.ఈశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బండారులంకలో వైఎస్సార్ సీపీ దీక్ష


శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి తిరుపతి లడ్డూపై ప్రభుత్వ కుట్ర రాజకీయాలకు వ్యతిరేకంగా చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ అంటూ మండలంలోని బండారులంక పంచాయతీ కార్యాలయం ఎదుట వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. బండారులంక గ్రామ కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన దీక్షకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి బాబు, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్ తదితరులు దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంలో చంద్రబాబు చేసిన పాపం ఊరికే పోదన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, ఎంపీటీసీలు గుత్తుల జానకి లక్ష్మి, అంకం హిమ భారతి, నాయకులు జాన గణేష్, వాసా దొరబాబు, దంగేటి రుద్ర, గుత్తుల సురేష్, పెదపూడి బాబురావు, కాలెపు శ్రీను, ఇనుమర్తి లింగమూర్తి, చింత ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి గుడ్ సీడ్ ఫౌండేషన్ సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న రమణరావు

అమలాపురం టౌన్: అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు నక్కావారిపేటకు చెందిన బూల వంశీరామ్ రెండు కిడ్నీలు దెబ్బతిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వంశీరామ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు బాధితుడికి ఆర్థిక సాయం సమకూర్చారు. అమలాపురంలోని ఫౌండేషన్ కార్యాయలంలో రోగి వంశీరామ్ తల్లిదండ్రులకు రూ.10 వేల చెక్‌ను రమణరావు అందజేశారు. సాయం చేసిన రమణారావుకు రోగి వంశీరామ్ తండ్రి బూల సత్యనారాయణ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సరెళ్ల రామకృష్ణ, పినిపే జయరాజ్, గుడ్ సీడ్ ఫౌండేషన్ ప్రతినిధులు నేరేడుమిల్లి శ్రీను, ఉండ్రు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణ మందిర వార్షికోత్సవం


గాడిమొగలో అలరించిన జానపద నాటకం

తాళ్లరేవు: మండలంలోని గాడిమొగలో శ్రీరాధాకృష్ణ మందిరం 4వ వార్షికోత్సవం కన్నుల పండుగగా జరిగింది. బాలల వేషధారణలు, గోపికల సయ్యాటలతో మారుమూలన ఉన్న మత్స్యకార గ్రామం గాడిమొగ బృందావనంగా మారింది. గ్రామానికి చెందిన సంగాడి పూసలయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రాధాకృష్ణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఇస్కాన్ కాకినాడ మందిరం ఇన్‌చార్జ్ అనంత శేషదాస్ హాజరై భగవద్గీత ప్రవచనం, హరిరామ సంకీర్తన, జపయజ్ఞం చేశారు. కార్యక్రమానికి హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పూసలయ్య, భక్త బృందాన్ని అభినందించారు. అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన బృందావన భక్తిరస జానపద నాటకం అందరినీ ఆకట్టుకుంది.

రైల్వే ఎలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలి


ఎంపీ హరీష్ మాథూర్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

అమలాపురం రూరల్: కోటిపల్లి–నర్సాపురం రైల్వే ఎలైన్‌మెంట్‌ను పునఃపరిశీలన చేయాలని కోరుతూ ఎంపీ జీఎం హరీష్ మాథూర్‌కు అమలాపురం మండల సర్పంచ్‌లు సోమవారం వినతి పత్రం అందజేశారు. రైల్వే లైన్ వల్ల 12 గ్రామాలకు మంచి నీటిని సరఫరా చేసే చిందాడగరువు వాటర్ ప్రాజెక్ట్ దెబ్బతింటుందన్నారు. అలాగే 1000 ఏళ్ల చరిత్ర కలిగిన చిందాడ మడుగు కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. పురాతనమైన అమలేశ్వరస్వామి దేవాలయం, చిందాడ మడుగు ఘాట్‌లో భక్తులు పుష్కర స్నానాలు మరుగున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పొణకల గణేష్, రేలంగి దుర్గారావు, మట్టా సాయి వైదేహి రామారావు, గంగుమళ్ల ఏసుబాబు పాల్గొన్నారు.

విజేతలైన మహిళా న్యాయవాదులకు సత్కారం


మహిళా న్యాయవాదులను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరంలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయవాదుల షటిల్ బ్యాడ్మింటన్, క్యారెమ్స్, చెస్ టోర్నమెంట్ పోటీల్లో అమలాపురం బార్ అసోసియేషన్ నుంచి మహిళా న్యాయవాదులు గుత్తుల విజయశ్రీ, కె.విజయలక్ష్మి విజేతలుగా నిలిచారు. న్యాయవాది విజయశ్రీ చెస్ క్రీడలో విన్నర్‌గా, మరో న్యాయవాది విజయలక్ష్మి క్యారెమ్స్‌లో రన్నర్‌గాను విజయం సాధించారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన ఈ ఇద్దరి మహిళా న్యాయవాదులను అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన అభినందన సభలో ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందిక శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు అడపా ప్రసాద్, వీరా నాగేశ్వరరావు, డీవీఎస్ఎన్ మూర్తి, నంబూరి సూర్యనారాయణమూర్తి, కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రీజియన్ టాపర్‌కు నగదు బహుమతి


డీజీపీ షాలినీసింగ్ నుంచి నగదు బహుమతి అందుకుంటున్న జెస్సీకా

యానాం: పుదుచ్చేరి రీజియన్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన నందికి జెస్సీకా సోమవారం పుదుచ్చేరి పోలీస్‌శాఖ డీజీపీ షాలినీసింగ్ చేతుల మీదుగా రూ.25,000 నగదు బహుమతి అందుకున్నారు. ఏటా పోలీస్ కుటుంబాల్లో ఇంటర్‌లో స్టేట్ టాపర్లకు పుదుచ్చేరి పోలీస్‌శాఖ ద్వారా నగదు బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నారు. ఆమె తండ్రి నందికి కృపావరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. యానాం రీజెన్సీలో చదివిన జెస్సీకా 1000 మార్కులకు గాను 985 మార్కులు సాధించింది. ఆమెను ఎస్పీ రాజశేఖరన్, పలువురు ఐపీఎస్ అధికారులు అభినందించారు.

కీర్తనకు నగదు బహుమతి

యానాం పోలీస్ శాఖలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పీవీఆర్ మూర్తి కుమార్తె, పుదుచ్చేరి రీజియన్‌లో పదో తరగతిలో రెండో ర్యాంకు సాధించిన పంపన కీర్తనకు సోమవారం డీజీపీ షాలినీసింగ్ నగదు బహుమతి అందజేశారు.

డీజిల్ ట్యాంకర్ పట్టివేత



పట్టుబడ్డ డీజిల్ ట్యాంకర్

ఐ.పోలవరం: కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి పి.గన్నవరం మండలం అంబాజీపేటకు అక్రమంగా తరలిస్తున్న డీజిల్ ట్యాంకర్‌ను సోమవారం ఐ.పోలవరం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా రూ.6 లక్షల విలువజేసే 5,500 లీటర్ల డీజిల్‌ను సీజ్ చేయడంతో పాటు ట్యాంకర్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు. యానాం నుంచి అక్రమంగా డీజిల్ ట్యాంకు రవాణా జరుగుతుండటంతో తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు.

ఘనంగా లక్షపత్రి పూజ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామివారి ఆలయంలో భాద్రపద మాసం మాసశివరాత్రి మహా పర్వదినాను పురస్కరించుకుని సోమవారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు నాగభట్ల రామకృష్ణమూర్తి, ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కూరగాయల వ్యాపారి అదృశ్యంపై కేసు

అమలాపురం రూరల్: మండలంలో బండారులంక కందులపాడు కాలనీకి చెందిన చింతా త్రిమూర్తులు(43) అదృశ్యంపై అతడి భార్య సూర్యావతి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని అమలాపురం రూరల్ ఎస్ఐ శేఖర్‌బాబు సోమవారం తెలిపారు. కూరగాయల వ్యాపారం చేసే త్రిమూర్తులు వ్యాపారం సక్రమంగా జరగడం లేదని, మానేస్తానని ఈ నెల 27న భార్యతో చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగిందన్నారు. ఆ రాత్రి నుంచి తన భర్త కనిపించడం లేదంటూ ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

అమలాపురం రూరల్: మండలంలో ఇందుపల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పదో తరగతి చదువుతున్న కడిమి నాని, జల్లి జితేంద్రలు కాకినాడ జిల్లా స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. పాఠశాలలో సోమవారం విజేతలను హెచ్ఎం శ్రీనివాసరావు, సర్పంచ్ చొల్లంగి శివాలిని, పీఈటీ నరసింహరావు, ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

దసరా ఆహ్వాన పత్రాల విడుదల

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీదేవి అమ్మవారి ఆలయ దసరా ఉత్సవాలకు సంబంధించిన, అమ్మవారి నిమజ్జన ఆహ్వాన పత్రాలను రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ స్థానిక శ్రీరామపురంలో సోమవారం విడుదల చేశారు. మూడున్నర అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పుతో శ్రీదేవి ఉత్సవ కమిటీ ఏటా దసరా ఉత్సవాలకు ఆహ్వాన పత్రాన్ని ముద్రించడం ఆనవాయితీగా వస్తోందని మంత్రి సుభాష్ చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు ఆశెట్టి ఆదిబాబు, మామిడిపల్లి రాంబాబు, గంగాబత్తుల వెంకన్న, నల్లా రాంబాబు, గంగాబత్తుల కొండ, దోనూరి శివ తదితరులు శ్రీదేవి దసరా ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రిని ఆహ్వానించారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

యానాం: 2023–24 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్ తరగతుల్లో 95 శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం స్థానిక ది సిటిజన్ కోపరేటివ్ సొసైటీ బ్యాంకు ప్రతిభా అవార్డులతో సత్కరించింది. ఈ సందర్భంగా ఇంటర్ విభాగంలో ఇండుగుల తన్మయ, కాకి శ్రీశ్రేయ, పదో తరగతిలో రెడ్డి పావని సత్యసాయిశ్రీ, అనంతపల్లి నాగఅక్షయ అంజనలకు విశ్రాంత పరిపాలనాధికారి నామాడి అప్పారావు చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.10 వేల చెక్‌ను, ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మేనేజర్ కాశి అశోక్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.